
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 26 । మే । 2025



బొప్పాయి.. మేలోయి

ఉమ్మడి జిల్లాలో సుమారు రెండు వేల ఎకరాల్లో బొప్పాయి సాగవుతుండగా రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు. 8లో



ఐకేపీలో అక్రమాల పర్వం..

బూర్గంపాడు ఐకేపీలో లక్షల రూపాయల నిధులు స్వాహా చేశారు. ఆ సొమ్ము రికవరీ చేయాలని ఆందోళన చేపట్టారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 27°

జిల్లాలో సోమవారం వాతావరణం కొద్దిమేర ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా రుద్రహోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేషపూజలు, రుద్రహోమం వైభవంగా నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని యాగశాలలో రుద్రహోమం, పంచామృతాభిషేకం జరిపారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాలతో స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజల అనంతరం రుద్రహోమం చేశారు. చివరన పూర్ణాహుతి నిర్వహించారు. రుద్రహోమం పూజలో పాల్గొన్న దంపతులకు అర్చకులు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు.

ముగిసిన డీడీఎన్ దరఖాస్తు గడువు

ఉమ్మడి జిల్లాలో 210 ఆలయాల నుంచి దరఖాస్తులు

ఖమ్మంగాంధీచౌక్: దేవాలయాల నిర్వహణ కోసం రూపొందించిన ధూపదీప నివేదన(డీడీఎన్) పథకం దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారంతో ముగిసింది. ఈనెల 1న రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 210 ఆలయాల నుంచి దరఖాస్తులు అందాయి. ఇందులో ఖమ్మం జిల్లా నుంచి 145, భద్రాద్రికొత్తగూడెం జిల్లా నుంచి 65 దరఖాస్తులు ఉండగా, అధికారులు పరిశీలనప్రారంభించారు. కనీసం 15ఏళ్ల చరిత్ర కలిగి, దేవాదాయ శాఖలో రిజిస్టర్ అయిన ఆలయాల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తుండగా, అర్హత ఉన్న వాటి దరఖాస్తులను రాష్ట్ర కమిషనర్‌కు నివేదికను పంపిస్తారు. ఆతర్వాత ఆలయాలకు పడితరం(ధూపదీప నివేదన) కింద రూ.4 వేలు, అర్చకుల గౌరవ వేతనంగా రూ.6 వేలు అందిస్తారు. 2007లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఈ పథకం ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 450 దేవాలయాలకు అమలవుతోంది.

నేటి నుంచి సర్వేయర్ అభ్యర్థులకు శిక్షణ

చుంచుపల్లి: భూభారతి చట్టం అమలులో భాగంగా లైసెన్స్‌డ్‌సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు అర్హుల నుంచి ఇటీవల దరఖాస్తులను స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా 426 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు కోసం దరఖాస్తులను సమర్పించారు. సోమవారం నుంచి వారికి కొత్తగూడెం మైనింగ్ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారితోపాటు జిల్లాలో పనిచేస్తున్న 18 మంది సర్వేయర్లతో శిక్షణ ఇవ్వనున్నట్లు ఉమ్మడి జిల్లా ఏడీ శ్రీనివాసులు తెలిపారు.

ఆగుతూ.. సాగుతూ.. తెర మరుగు!

ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణాల్లో తీవ్ర జాప్యం

- బిల్లులు మంజూరుకాక రెండోసారి ఆగిపోయిన పనులు
- అద్దె భవనాల్లో హాస్టళ్లు, ఇరుకు గదుల్లో తరగతులు



అర్ధంతరంగా ఆగిపోయిన మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నాలుగో ఏడాదిలోకి వస్తున్నా మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. అకడమిక్ తరగతి గదులు, హాస్టల్, మెస్, రెసిడెంట్ వైద్యుల క్వార్టర్లు వంటి నిర్మాణ పనులు శ్లాబ్ దశకు చేరుకున్న సమయంలో మరోసారి ఆగిపోయాయి.

ఆగిన పనులు

మెడికల్ కాలేజీ హాస్టల్, తరగతి గదులు, మెస్, రెసిడెంట్ డాక్టర్ల క్వార్టర్లు తదితర తొమ్మిది రకాల భవనాల నిర్మాణం జరుగుతోంది. అకడమిక్ క్లాసులు నిర్వహించే భవనం జీ ప్లస్ 4, బాయ్స్, గర్ల్స్ హాస్టళ్లు జీ ప్లస్ 5 పద్ధతిలో నిర్మించాల్సి ఉంది. మెస్, స్టాఫ్ క్వార్టర్స్ జీ ప్లస్ 2గా నిర్మించాల్సి ఉంది. 2023 ఆరంభంలో పనులు మొదలవగా 2024 డిసెంబరు నాటికి పూర్తి కావాల్సి ఉంది. నిధుల విడుదలలో జాప్యం కారణంగా నిర్మాణ పనులు ఆగుతూ సాగుతున్నాయి. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు శ్లాబ్ దశకు చేరుకోగా రూ. 75 కోట్ల మేర పనులు జరిగినట్టు తెలుస్తోంది. ఇంకా తలుపులు, కిటికీలు, డ్రెయినేజీ, ఎలక్ట్రికల్ తదితర పనులు చేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రూ.30 కోట్లకు పైగా పేరుకుపోవడంతో పనులు మధ్యలోనే ఆగినట్టు తెలుస్తోంది.

నాలుగేళ్లుగా

కరోనా సంక్షోభం తర్వాత వైద్యసేవల రంగాన్ని విస్తరించడంలో భాగంగా కొత్త మెడికల్ కాలేజీలను అప్పటి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మంజూరు చేసింది. ఈ క్రమంలో జిల్లాకు 2021లో వైద్య కళాశాల మంజూరైంది. దీనికి అనుబంధంగా నర్సింగ్ కాలేజీ కూడా వచ్చింది. మెడికల్ కాలేజీ కంటే నర్సింగ్ కాలేజీ భవనాలు ముందుగా నిర్మించారు. దీంతో నర్సింగ్ కాలేజీ కోసం నిర్మించిన భవనాల్లోనే మెడికల్ కాలేజీ కొనసాగుతోంది. మరోవైపు అద్దె భవనంలో నర్సింగ్ కాలేజీ నడుస్తోంది. కాలేజీ మంజూరై నాలుగేళ్లు పూర్తయినా ఇప్పటికీ భవనాలు పూర్తి కాలేదు.

పెరుగుతున్న వ్యయం

మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు 2023లో మొదలయ్యాయి. బిల్లులు మంజూరు కావడం లేదంటూ నిర్మాణ పనులు పునాదుల దశలో ఉండగానే అదే ఏడాది జూన్‌లో కాంట్రాక్టర్ పనులు నిలిపేశాడు. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో 2024 జూన్ వరకు ఏడాదిపాటు ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. చివరకు మంత్రి పొంగులేటి చొరవతో రూ. 30 కోట్లు మంజూరుకాగా 2024 జూలైలో మళ్లీ పనులు ఊపందుకున్నాయి. ఇదే జోరులో ఈ ఏడాది చివరికైనా భవనాలు అందుబాటులోకి వస్తాయనుకుంటే సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఆలస్యం కారణంగా నిర్మాణ వ్యయం కూడా పెరుగుతోంది. ఆరంభంలో భవనాల నిర్మాణ వ్యయం రూ. 105 కోట్లు ఉండగా, తొలి సవరణలో రూ.130 కోట్లకు చేరింది. ప్రస్తుతం అది రూ.147 కోట్లకు చేరుకుంది.

ఇరుకు హాస్టళ్లలో..

మెడికల్ కాలేజీలో మొదటి బ్యాచ్ విద్యార్థులు 2022 నవంబర్‌లో చేరారు. ప్రస్తుతం మూడు బ్యాచ్‌లకు సంబంధించి 450 మంది విద్యార్థులు ఉన్నారు. బాయ్స్ హాస్టల్ కాలేజీ క్యాంపస్ ఎదురుగా ఉన్న మంచికంటి నగర్ ఏరియాలో, గర్ల్స్ హాస్టల్ పాల్వంచ మార్కెట్ ఏరియాలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మూడు బ్యాచ్‌ల విద్యార్థులు రావడంతో ఇప్పటికే అద్దె భవనాలు కిక్కిరిసి ఉన్నాయి. అద్దె బిల్లులు కూడా సకాలంలో రాకపోవడంతో భవనాల యజమానులు సైతం గుర్రుగా ఉంటున్నారు. ఈ ఏడాది నాలుగో బ్యాచ్‌లో మరో 150 మంది విద్యార్థులు రాబోతున్నారు. కనీసం ఈ ఏడాది చివరి నాటికైనా కొత్త భవనాలు అందుబాటులోకి రాకపోతే విద్యార్థులకు ఇక్కట్లు తప్పవు. ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి పెండింగ్ బిల్లులు వచ్చేలా చూడాలని మెడికల్ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.

- జిల్లాలో మూతపడుతున్న సినిమా థియేటర్లు
- ప్రేక్షకులు రాక యాజమాన్యాలకు నిర్వహణ భారం
- ఇప్పటికే కొన్ని ఫంక్షన్‌హాల్, షాపింగ్ మాల్స్‌గా..
- ఉపాధి కోల్పోతున్న థియేటర్‌లో పనిచేసే కార్మికులు



భద్రాచలంలో మూతపడిన సినిమా థియేటర్



బూర్గంపాడులో పరిశ్రమకు లీజుకు ఇచ్చిన థియేటర్ ప్రాంగణం

బూర్గంపాడు: ఒక్కప్పుడు కొత్త సినిమా వచ్చిందంటే థియేటర్ల వద్ద పండుగ వాతావరణం కనిపించేది. ఇప్పుడు కనీసం సగం థియేటర్ కూడా నిండే పరిస్థితి లేదు. పెద్ద హీరోల సినిమాలు కూడా మూడురోజుల ముచ్చటగానే మారుతున్నాయి. ప్రస్తుతం థియేటర్లు నడిపే యాజమాన్యాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. ఒక్కోసారి సినిమా షో ప్రదర్శిస్తే కనీసం కరెంట్ బిల్లు కూడా రావడంలేదని పేర్కొంటున్నాయి. సినిమా విడుదలైన రోజే పైరసీ ప్రింట్ సెల్‌ఫోన్లలో హల్‌చల్ చేయడం, ఓటీటీ ప్లాట్‌ఫామ్ విస్తృతం కావడంతో ప్రేక్షకులు థియేటర్ వైపు వెళ్లడంలేదు. కొత్త మూవీలు కూడా ఓటీటీలో ఇంట్లో కూర్చునే వీక్షిస్తున్నారు. తెలుగుతోపాటు పలు భాషా చిత్రాలు కూడా ఓటీటీతో చేరువ అవుతున్నాయి. దీంతో వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన థియేటర్లు ఇప్పుడు మూతపడుతున్నాయి.

నమ్ముకున్న కార్మికులు రోడ్డున..

సినిమా థియేటర్ల మూసివేతతో పలువురు కార్మికులు వీధిన పడుతున్నారు. సినిమా నడిపించే ఆపరేటర్లు, స్వీపర్లు, పోస్టర్లు వేసేకార్మికులు, టికెట్ బుకింగ్, క్యాంటీన్, సైకిల్ స్టాండ్, పాన్‌షాపులు, కూల్ డ్రింక్ షాపులు, తినుబండారాల షాపుల నిర్వాహకులు ఉపాధి కోల్పోతున్నారు. ప్రేక్షకులను థియేటర్లకు తీసుకొచ్చే ఆటోవాలాలకు కూడా గిరాకీ తగ్గుతోంది. వీరిలో చాలామంది కూలి పనులకు వెళ్తుండగా, కొందరు పాన్‌షాపులు, బజ్జీల బండ్లు పెట్టుకుని నెట్టుకొస్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో కూడా 5జీ నెట్‌వర్క్ విస్తరించి ఇళ్లలోనే ఓటీటీ ప్లాట్‌ఫామ్స్, హోమ్ థియేటర్లు వెలుస్తున్నాయి. ఈ క్రమంలో రానున్న రోజుల్లో థియేటర్లు పూర్తిస్థాయిలో మూతపడే ప్రమాదం ఉంది.

సగం థియేటర్లు మూత

జిల్లాలో ఇప్పటికే సగం థియేటర్లు మూతపడ్డాయి. ప్రస్తుతం నడుస్తున్నవి కూడా నష్టాలతోనే సాగుతున్నాయి. జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఏడు థియేటర్లు ఉండగా, ప్రస్తుతం మూడు మాత్రమే నడుస్తున్నాయి. రెండు థియేటర్లను కూల్చివేశారు. ఒక థియేటర్‌ను షాపింగ్‌మాల్‌గా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు పట్టణాల్లో మూడు చొప్పున థియేటర్లు ఉండగా, ఇప్పటికే ఒక్కోటి మూతపడ్డాయి. పాల్వంచలో నాలుగు థియేటర్లు ఉండగా, రెండు మూతపడ్డాయి. చర్లలో రెండు థియేటర్లు ఉండగా, ఒకటి ఫంక్షన్‌హాల్‌గా మార్చారు. సారపాకలో ఉన్న థియేటర్ కూడా మూతపడగా, ఫంక్షన్‌హాల్, షాపింగ్ మాల్‌గా మార్చే ఆలోచనలో యాజమాన్యం ఉంది. బూర్గంపాడులోని థియేటర్‌ను మూసివేసి ఐటీసీ అనుబంధ పరిశ్రమకు లీజుకు ఇచ్చారు. అశ్వారావుపేటలో ఒక థియేటర్ మాత్రమే ప్రస్తుతం నడుస్తోంది. దమ్మపేటలో ఉన్న థియేటర్ అప్పుడప్పుడు నడిపిస్తున్నారు.

ఉపాధి కోల్పోయాం



20 ఏళ్లు ఆపరేటర్‌గా పనిచేశాను. నాతోపాటుగా మరో 15 మంది థియేటర్‌లో పనిచేశారు. ప్రేక్షకులు రాకపోవడంతో యాజమాన్యం థియేటర్ మూసివేసింది. దీంతో మేమంతా ఉపాధి కోల్పోయాం. ఇప్పుడు ఖాళీగా ఉండాల్సివస్తోంది.

– పి.రాధాకృష్ణ, ఆపరేటర్, బూర్గంపాడు

10 మందిమి బతికాం



థియేటర్ ఉన్నప్పుడు పదిమందిమి బతికాం. నేను పదిహేనేళ్లు సినిమా పోస్టర్లు వేశాను. హాల్ ముందు చాలామంది చిరువ్యాపారులు కూడా బతకగలిగారు. థిటియేటర్ మూసివేతతో ఇప్పుడు పాన్‌షాప్ నడుపుకుంటున్నాను.

– సదాలు, బూర్గంపాడు

ప్రశాంతంగా గ్రామ పాలనాధికారుల పరీక్ష..

కొత్తగూడెంఅర్బన్: గ్రామ పాలనాధికారుల నియామక పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 177 మందికి గాను 160 మంది మాజీ వీఆర్‌ఏలు, వీఆర్వోలు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. కొత్తగూడెంలోని సింగరేణి పాఠశాల పరీక్ష కేంద్రంతోపాటు పలు కేంద్రాలను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సందర్శించి, పరిశీలించారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒక్కరోజు ఆదాయం రూ.64,025



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. మండల పరిధిలోని కిన్నెరసానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్ సమీపం నుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయ నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 698 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.38,025 ఆదాయం లభించింది. 500 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.28,000 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారికి ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అలరించిన భక్తి గీతాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన సన్నిధిలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఆవుల శ్రీలాస్య ఆలపించిన కర్ణాటక సంగీత భక్తి గీతాలాపన భక్తులను అలరించింది. డాక్టర్ అశ్విన్, రాయప్రోలు సుబ్రహ్మణ్య శర్మ, జగన్మోహిని తదితరులు సంగీత సహకారం అందజేశారు.

ఆర్టీఐపై అవగాహన పెంచుకోవాలి

రాష్ట్ర సమాచార కమిషనర్ శ్రీనివాస్



ఆర్టీఐ కమిషనర్ శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్: సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర సమాచార కమిషనర్ పీవీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. చట్టం దుర్వినియోగం చేసేవారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చట్టాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత శ్రీనివాస్‌ను తెలంగాణ ఉద్యమ నాయకులు, సింగరేణి సంఘాల నాయకులు, జర్నలిస్టు సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. రాజకీయ పార్టీల నాయకులు జీవీఎస్ చౌదరి, బిక్కసాని నాగేశ్వరావు, జీవీకే మనోహర్, కంచర్ల చంద్రశేఖర్, మేరెడ్డి జనార్దన్ రెడ్డి, జర్నలిస్టు సంఘాల నాయకులు దుద్దుకూరి రామారావు, కల్లోజి శ్రీనివాసరావు, మహ్మద్ షఫీ, వట్టికొండ రవి, చంద్రా నరసింహారావు, ఇమంది ఉదయ్ కుమార్, సుధాకర్, వాహబ్, విద్యాసంస్థల అధినేతలు మాచవరపు కోటేశ్వరరావు, తలశిల భరత్‌కృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీఐ నూతన కమిషనర్‌కు కలెక్టర్ స్వాగతం

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర సమాచార కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పి.వీ శ్రీనివాస్ తొలిసారిగా ఆదివారం కొత్తగూడెం వచ్చారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆయన్ను కొత్తగూడెంలోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందజేసి స్వాగతం పలికారు.

సేద్యానికి ‘స్వర్ణ’యుగం

తక్కువ ధరకే రోటోవేటర్ యంత్రం తయారీ

- పూరి గుడిసెలో సాగుతున్న కుటీర పరిశ్రమ
- ఆదర్శంగా నిలుస్తున్న యువ మహిళా ఇంజనీర్





సోదరి, తండ్రితో కలిసి కల్టివేటర్ తయారీలో స్వర్ణ (కుడి) (ఇన్‌సెట్) డబుల్ వీల్ కల్టివేటర్ (పవర్ వీడర్)

ఇల్లెందు రూరల్: గతంతో పోలిస్తే వ్యవసాయంలో యాంత్రీకీకరణ పెరిగి రైతులకు పనులు సులువవుతున్నాయి. విత్తనాలు నాటడం నుంచి పంట చేతికందే వరకు అన్నింటికీ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే వాటి ధరకు భయపడి సన్న, చిన్నకారు రైతులు ఇంకా కూలీలపైనే ఆధారపడుతున్నారు. ఈ క్రమంలో తక్కువ ధరకే కల్టివేటర్ తయారు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది ఓ యువ ఇంజనీర్.

కుల వృత్తే స్ఫూర్తిగా..

ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం గ్రామానికి చెందిన చిట్టోజి మోహనాచారి కుల వృత్తి అయిన వడ్రంగి పనులతో జీవనం సాగించేవాడు. వ్యవసాయ పనిముట్లు తయారు చేయడం ఆయన ప్రత్యేకత. కుమార్తె స్వర్ణ బీటెక్ పూర్తి చేసింది. చిరుప్రాయం నుంచి తండ్రి చేసే పనులు చూసిన ఆమె.. కరోనా సమయంలో ఇంటి వద్ద తండ్రికి సాయంగా ఉంటూ వ్యవసాయానికి అవసరమయ్యే కల్టివేటర్ తయారీపై దృష్టి సారించింది. మార్కెట్ కంటే తక్కువ ధరతోనే రూపొందించి స్థానిక రైతులకు విక్రయించింది. రైతుల నుంచి ప్రోత్సాహం లభించడంతో నాలుగేళ్లుగా విజయవంతంగా కొనసాగిస్తోంది.

ఇంటివద్దే పూరిగుడిసెలో..

ఆర్థిక పరిస్థితి సహకరించకున్నా.. ప్రారంభంలో అప్పు చేసి కల్టివేటర్(పవర్ వీడర్) తయారీకి అవసరమైన ముడి సరుకును హైదరాబాద్, విజయవాడ నుంచి తెప్పించేది. ఆపై ఇంటి వద్దే తండ్రి, సోదరి రజిత సహకారంతో విజయవంతంగా కల్టివేటర్ తయారీ ప్రారంభించింది. మొదట నెలకు నాలుగైదు యంత్రాలను తయారు చేసి.. క్రమంగా ఆ సంఖ్యను పదికి పెంచింది. మార్కెట్‌లో కల్టివేటర్ ధర రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు ఉండగా.. స్వర్ణ మాత్రం 7హెచ్‌పీ సింగిల్ వీల్ కల్టివేటర్ రూ.26 వేలు, 7హెచ్‌పీ డబుల్ వీల్ కల్టివేటర్ రూ.28 వేలకే విక్రయిస్తోంది. ధర తక్కువైనా బయటి వాటికంటే నాణ్యంగా ఉన్నాయని రైతులు కితాబిస్తుండడం విశేషం.

వినియోగం ఇలా..

ఎరువులు, పురుగు మందులతో పాటు కూలీల రేట్లు కూడా భారీగా పెరగడంతో రైతులకు పెట్టుబడి భారమవుతోంది. ఈ క్రమాన యాంత్రీకరణ విధానం భారం తగ్గిస్తున్నా.. వాటి ధరలు చూసి చాలా మంది వెనకడుగు వేస్తున్నారు. అయితే స్వర్ణ తయారు చేస్తున్న కల్టివేటర్(పవర్ వీడర్లు) ఉద్యాన పంటలు, వాణిజ్య పంటలు సాగు చేసే రైతులకు అండగా నిలుస్తున్నాయి. విత్తనం మొలకెత్తే దశలో కలుపు తొలగించడం, మొక్కల వరుస మధ్యలో దున్నడం, ఆ తర్వాత పాదులు చేయడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి.

ప్రోత్సహిస్తే మరిన్ని యంత్రాలు



బీటెక్‌లో నేర్చుకున్న పాఠాల ఆధారంగా వ్యవసాయ యాంత్రీకరణపై దృష్టి సారించా. తొలి ప్రయత్నంలో విజయం సాధించా. ఇవి అమ్మితే వస్తున్న ఆదాయం పెట్టుబడి ఖర్చులు పోగా కుటుంబ పోషణకు సరిపోతోంది. యంత్రాల తయారీని విస్తరించే ఆర్థిక స్తోమత లేదు. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందిస్తే మరిన్ని వ్యవసాయ యంత్ర పరికరాలు తయారుచేస్తా.

– చిట్టోజి స్వర్ణ

ఫార్మర్ ఐడీలో కొనసాగుతున్న అగ్రస్థానం

76,705 మంది రైతుల నమోదు, 58,993 మందికి కార్డులు

ఖమ్మంవ్యవసాయం: రైతు గుర్తింపు(ఫార్మర్ ఐడీ) నమోదులో జిల్లా అగ్రస్థానాన కొనసాగుతోంది. ఈనెల 5నుంచి జూన్ 5వరకు నెల పాటు నమోదు చేయనుండగా, ప్రతీ వారం జిల్లాల వారీగా ప్రగతిని వెల్లడిస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయటంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ ఐడీ ప్రాజెక్టు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 32 జిల్లాల్లో 74,93,527 మంది రైతులకు గాను 6,51,751 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 3,40,072 మందికి శనివారం(ఈనెల 24వ తేదీ) వరకు 76,705 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 58,993 మంది ఐడీ కార్డులు కూడా జనరేట్ చేశారు. ఈ నేపథ్యాన జిల్లా గత వారం, ఈ వారం కూడా రాష్ట్రంలోనే అగ్ర స్థానాన కొనసాగుతోంది. ఇక రెండు నుంచి ఐదో స్థానం వరకు రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి, నిజామాబాద్ నిలిచాయి. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 17వ స్థానంలో నిలవగా, చివరి స్థానంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొనసాగుతోంది. వ్యవసాయ విస్తర్ణాధికారులు, వ్యవసాయాధికారుల కృషికి తోడు రైతుల్లో అవగాహన పెరగడంతో ఫార్మర్ ఐడీలో జిల్లా అగ్రస్థానాన కొనసాగుతోందని ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. ఇంకా మిగిలిన రైతులు సైతం పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డుల వివరాలతో ఏఈఓలను సంప్రదించాలని, లేదా మీ సేవా కేంద్రాల్లోనూ నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు.

క్లుప్తంగా

ఇల్లెందువాసికి డాక్టరేట్


షేక్ రజియా

ఇల్లెందు: ఇల్లెందు కరెంటాఫీస్ ఏరియాకు చెందిన షేక్ రజియాకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి భౌతికశాస్త్రం విభాగంలో డాక్టరేట్ లభించింది. ఆదివారం రజియా వివరాలు వెల్లడించారు. ఫిజిక్స్ ప్రొఫెసర్ కరుణసాగర్ నేతృత్వంలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ లభించిందని తెలిపింది. ఆమెకు డాక్టరేట్ రావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ


చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న ఎస్ఐ

సుజాతనగర్: తాళం వేసిన రెండిళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మండల కేంద్రంలోని బాలాజీనగర్‌లో ఆదివారం వెలుగుచూసింది. ఎస్ఐ రమాదేవి కథనం మేరకు.. బాలాజీనగర్‌లో కూరపాటి రాజేంద్రప్రసాద్, నాయుడు సతీశ్ వేర్వేరు వీధుల్లో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ ఇళ్లకు తాళం వేసి కుటుంబ సమేతంగా ఊరికి వెళ్లారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి ఇళ్లలోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. రాజేంద్రప్రసాద్ ఇంట్లో 4.4 తులాల బంగారపు వస్తువులు, 44 తులాల వెండి, రూ.30 వేల నగదు, సతీశ్ ఇంట్లో 7 తులాల వెండి వస్తువులు, రూ.5 వేల నగదును చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, క్లూస్ టీం ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అటవీశాఖ సిబ్బందిపై ఫిర్యాదు

దుమ్ముగూడెం: మండలంలోని గడ్డోరగట్ట గ్రామానికి చెందిన పోడు గిరిజనులు అటవీశాఖ సిబ్బందిపై ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలో అటవీశాఖ అధికారులు ఫారెస్ట్ ప్రొటెక్షన్ వాచర్లతో టేకు చెట్లను నరికిస్తుండగా గ్రామస్తులు వెంబడించారు. ఇద్దరు పారిపోగా మరో ఇద్దరు వాచర్లు దొరకడంతో వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివాసీలకు వ్యతిరేకంగా హైకోర్టులో వ్యతిరేక సాక్ష్యాలను సృష్టించేందుకు అటవీశాఖ చేసిన కుటిల యత్నాలు బెడిసికొట్టాయని పలువురు అంటున్నారు. ఈ ఘటనపై సీఐ అశోక్ మాట్లాడుతూ.. కేసు హైకోర్టులో ఉన్నందున.. ఈ ఘటనపై అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని పోడుసాగుదారులకు సూచించారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు.. ఒకరు మృతి

కొణిజర్ల: ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన ఆదివారం సాయంత్రం కొణిజర్లలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పెద్దరాంపురం గ్రామానికి చెందిన ఇనపనూరి నాగేశ్వరరావు అలియాస్ నాగరాజు (33) తన కుమార్తెను ఖమ్మం వైద్యశాలలో చేర్పించి డబ్బుల కోసం ఇంటికి వస్తున్న క్రమంలో బస్వాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఖమ్మం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుష్మ, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూరజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొప్పాయి.. మేలోయి

పంట సాగుతో పెట్టుబడికి రెట్టింపు ఆదాయం

- ఉమ్మడి జిల్లాలో 2 వేల ఎకరాల్లో సాగు
- ఎకరాకు 25 టన్నుల వరకు దిగుబడి
- రూ. 20 వేల వరకు పలుకుతున్న టన్ను ధర


ఖమ్మం సమీకృత మార్కెట్‌లో అమ్ముతున్న బొప్పాయి పండ్లు

ఖమ్మంవ్యవసాయం: అధిక ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటల్లో బొప్పాయి ఒకటి. ఇతర ఉద్యాన పంటలతో పోలిస్తే ఇది తక్కువ కాలపు పంట. మొక్క వేసిన తొమ్మిది నెలల్లో ఉత్పత్తి ప్రారంభమవుతుంది. తోటలకు నాలుగేళ్ల పాటు అవకాశం ఉన్నా ఏడాదిన్నర నుంచి రెండేళ్ల వరకే దిగుబడి పొందుతూ ఆ తర్వాత తొలగిస్తున్నారు. మార్కెట్‌లో బొప్పాయికి డిమాండ్ పెరగడంతో రైతులు ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. బొప్పాయితో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. జ్వరం, ఇతర వ్యాధులు సోకినప్పుడు బొప్పాయి పండు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇది జీర్ణ వ్యవస్థను కూడా మెరుగు పరుస్తుంది. చర్మం, కంటి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. వివిధ రకాల విటమిన్లు, పోషకాలను ఇస్తుండగా దీనికి డిమాండ్ పెరిగింది. ఈ పంట సాగు పెరిగినప్పటికీ.. దీనికి కూడా ప్రకృతి వైపరీత్యాల సమస్య ఉంది. ఈదురుగాలులు వచ్చినప్పుడు దెబ్బతినే ప్రమాదం ఉంది.

2 వేల ఎకరాల్లో సాగు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2 వేల ఎకరాల్లో బొప్పాయిని రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలోని రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్, కామేపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, బోనకల్, చింతకాని, ముదిగొండ, మధిర, వైరా, ఏన్కూరు, తల్లాడ తదితర మండలాల్లో 1,700 ఎకరాల్లో ఈ పంట సాగు చేస్తుండగా, భద్రాద్రి జిల్లాలోని జూలూరుపాడు, సుజాతనగర్, ఇల్లెందు, టేకులపల్లి, బూర్గంపాడు, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి తదితర మండలాల్లో 300 ఎకరాల్లో సాగులో ఉంది.

ఖర్చుకు డబుల్ ఆదాయం..

బొప్పాయి సాగు పెట్టుబడి ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. మొక్కలు, డ్రిప్, మల్చింగ్, దుక్కులు చేయడం తదితర ఖర్చులుంటాయి. అయితే ప్రభుత్వం ఈ పంట సాగుకు ప్రోత్సాహకంగా ఎకరాకు రెండేళ్ల కాలానికి రూ. 27వేల వరకు ఇస్తుంది. ఇక ఎకరాకు ఆదాయం రూ.2 లక్షలకు పైగా వస్తుంది. ఉమ్మడి జిల్లాలో సాగు చేసే బొప్పాయి ఎకరాకు 25 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. పంట వేసిన 9 నెలల నుంచి ఉత్పత్తి ప్రారంభం అవుతూ ప్రతీ 15 రోజులకు ఒకసారి చేతికందుతుంది. మొదటి 8 కోతల కాయ బాగా నాణ్యంగా ఉంటుంది. ఆ తర్వాత కొంతమేరకు నాణ్యతతో పాటు సైజ్ కూడా తగ్గుతాయి. 20 నుంచి 22 టన్నుల వరకు నాణ్యమైన, 3 నుంచి 5 టన్నులు కొంత తక్కువ నాణ్యత గల కాయలు దిగుబడి అవుతాయి.

టన్ను రూ.20 వేలు..

బొప్పాయి టన్ను ధర రూ.20 వేల వరకు పలుకుతుంది. ఢిల్లీ, కోల్‌కతా, ముంబయి ప్రాంతాల వ్యాపారులు ఇక్కడి తోటలను పరిశీలించి కాయ సైజు, నాణ్యత ఆధారంగా ధర నిర్ణయిస్తారు. మొదటి కోత టన్నుకు రూ. 18 వేల నుంచి రూ. 20 వేల వరకు, చివరి కోత రూ.10 వేల వరకు పెడుతున్నారు.

ఆదాయపు పంట బొప్పాయి



బొప్పాయి ఆదాయపు పంట. పదేళ్లుగా ఈ పంట సాగు చేస్తున్నా. రెండెకరాల్లో సాగు చేస్తే 50 టన్నుల దిగుబడి వస్తోంది. టన్ను రూ.13 వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నా. ఇతర పంటలతో పోలిస్తే బొప్పాయి సాగు లాభదాయకం. రంజాన్ వంటి కాలాల్లో బొప్పాయికి బాగా డిమాండ్ ఉంటుంది. హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో టన్ను రూ. 40 వేల వరకు కూడా పలుకుతుంది.

– నల్లమోతు వెంకటేశ్వర్లు, బూడిదంపాడు

18 ఎకరాలల్లో సాగు చేస్తున్నా..



18 ఎకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్నా. కౌలుతో కలిపి 18 ఎకరాలకు రూ. 25 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. ఎకరాకు 25 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. రూ. 50 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి బొప్పాయిని తొలగించి నూతనంగా పంట సాగు చేస్తా. ఉద్యాన పంటల్లో బొప్పాయి నుంచి ఆదాయం బాగుంటుంది.

– యారం లక్ష్మీరెడ్డి, లక్ష్మీపురం, బూర్గంపాడు మండలం

బొప్పాయి విస్తీర్ణం పెరుగుతోంది



బొప్పాయి సాగుకు రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏటేటా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. బొప్పాయి పంటకు మార్కెట్‌లో ధర పలుకుతుండగా రైతులు సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇక ప్రభుత్వం కూడా ఈ పంట సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. పంట సాగుపై రైతుల్లో అవగాహన పెరిగింది. ఇది లాభదాయకమైన పంటగా గుర్తింపు పొందుతోంది.

– జి.నగేష్, ఉద్యానాధికారి, ఖమ్మం డివిజన్

ఐకేపీలో అక్రమాల పర్వం..


బూర్గంపాడు ఐకేపీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

- స్త్రీనిధి చెల్లింపుల్లో నిధులు స్వాహా
- సీసీకి షోకాజ్ నోటీసులు జారీ

బూర్గంపాడు: మండల ఇందిరా క్రాంతి పథం సిబ్బంది అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. సీసీలు, బుక్‌కీపర్‌లు అందినకాడికి డ్వాక్రా సంఘాల మహిళల సొమ్మును స్వాహా చేశారు. బూర్గంపాడు ఐకేపీలో లక్షల రూపాయల నిధులు స్వాహా అయినట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలుతోంది. శనివారం బూర్గంపాడు గౌతమిపురంలోని గ్రామసమాఖ్యలోని 19 డ్వాక్రా సంఘాల సభ్యులు చెల్లించిన స్త్రీనిధి రుణాలలో ఐకేపీ సిబ్బంది చేతివాటం చూపించినట్లు మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ ఆరోపణలపై స్త్రీనిధి ఆర్ఎం సోషల్ ఆడిట్‌కు ఆదేశించారు. ఇదిలాఉండగా జీవనజ్యోతి, వెన్నెలజ్యోతి, శబరి, శ్రీరామ, చైతన్య, టేకులచెరువు, నకిరిపేట, కృష్ణసాగర్ గ్రామ సమాఖ్యల పరిధిలోని డ్వాక్రా సంఘాల సభ్యులు చెల్లించిన నిధులను వారి రుణఖాతాల్లో జమ చేయకుండా సీసీ రాంబాబు స్వాహా చేశారని గతంలోనే ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణ చేపట్టిన సెర్ప్ అధికారులు రూ.1.92లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. దీనిపై సంబంధిత సీసీ రాంబాబుకు షోకాజ్ నోటీస్‌లు జారీచేశారు. డ్వాక్రా మహిళలకు ఐకేపీ, స్త్రీనిధి నుంచి రుణాలు అందిస్తున్నారు. కాగా,రుణాలు ఇచ్చే సమయంలో కూడా ఐకేపీ సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారని, సీసీకి, బుక్‌కీపర్‌కు ఒక్కో సభ్యురాలు రూ.500 నుంచి రూ.1,000 వరకు ఇవ్వాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు. స్త్రీనిధి రుణాల మంజూరులో కూడా డబ్బులు ఇవ్వాల్సి వస్తోందంటున్నారు. సిబ్బంది కాజేసిన డబ్బులు రికవరీ చేసి తమ అప్పు ఖాతాల్లో జమచేయాలని డ్వాక్రా సంఘాల మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం


ట్రోఫీ గెలుచుకున్న జట్టుతో పీఓ రాహుల్

పాల్వంచరూరల్: క్రీడలతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. మండలంలోని కిన్నెరసానిలోని క్రీడాపాఠశాల మైదానంలో ఆదివారం భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఉద్యోగులకు క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఐటీడీఏ పీఓ జట్టు, భద్రాచలం జోన్, దమ్మపేట, ఇల్లెందు ఐటీడీఓ జట్లు పాల్గొన్నాయి. పీఓ పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. విధి నిర్వహణలో అలసిపోయిన ఉద్యోగులకు ఇలాంటి క్రీడలు ఎంతో ఉత్సాహాన్నిస్తాయని చెప్పారు. కాగా, ఫైనల్ మ్యాచ్‌లో ఐటీడీఏ పీఓ జట్టు, భద్రాచలం జోన్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన భద్రాచలం జోన్ జట్టు పది ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 116 పరుగులు చేశారు. పీఓ జట్టు పది ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 117 పరుగులు చేసి విజయం సాధించి కప్పును కైవసం చేసుకుంది. అయితే, ఐటీడీఓ పీఓ బి.రాహుల్ 9 పరుగులు చేయడమే కాక మూడు వికెట్లు తీశారు. కార్యక్రమంలో దమ్మపేట ఏటీడబ్ల్యూఓ చంద్రమోహన్, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాల్‌రావు, ఏఎస్ఓ వెంకటనారాయణ, నాగేశ్వరరావు, శంకర్, ఎం.బాలు, పి.వెంకటేశ్వర్లు, హరికృష్ణ, కబీర్ పాల్గొన్నారు.

బాబోయ్.. దొంగలు


సుందరయ్యనగర్‌లోని ఇంట్లో చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం

మణుగూరుటౌన్: మణుగూరులో రాత్రివేళ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఒకే నెలలో 14కు పైగా చోరీలకు జరగడం, ఘటనా స్థలాలు అన్నీ జన సంచారం ఉన్న ప్రదేశాలే కావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

తాళం వేసి వెళ్లారో..

నెల రోజులుగా మణుగూరు పట్టణంతో పాటు కార్మిక కుటుంబాలు నివాసం ఉండే సింగరేణి క్వార్టర్లలో వరుస దొంగతనాలు మండల ప్రజలను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. జన సంచారం అధికంగా ఉండే సుందరయ్యనగర్ వంటి ప్రధాన వార్డులో పక్కపక్కనే ఉన్న రెండు ఇళ్లలో చోరీకి పాల్పడి బంగారం, డబ్బు, మరో ఇంట్లో బియ్యం బస్తాలు, చీరలు, దుస్తులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. మూడు రోజుల కిందట పీవీకాలనీలోని ఏడు క్వార్టర్లలో దొంగలు పడగా, మూడు క్వార్టర్ల (ఎవరూ నివసించనివి) తాళాలు పగలగొట్టడం విశేషం. శుక్రవారం రాత్రి పీవీకాలనీలో అపార్ట్‌మెంట్లను పోలి ఉండే నాలుగు మిలీనియం క్వార్టర్లలో తాళాలు వేసి ఉన్న ఇళ్ల తలుపులు సునాయాసంగా తొలిగించి మిక్సీల దగ్గర నుంచి గ్యాస్ పొయ్యి వరకు దుండగులు చోరీ చేసి తరలించారు. వాహనాల్లో వచ్చి చడీచప్పుడు లేకుండా తాళాలువేసి ఉన్న ఇళ్లను దోచేస్తున్నారని కార్మిక కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. అంబేడ్కర్ సెంటర్‌లోని ఓబంగారం దుకాణంలో పట్టపగలే 12తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు.

గస్తీ పెంచినా ఆగని చోరీలు..

ఒకే నెలలో వరుస దొంగతనాలు బంగారు ఆభరణాలు, నగదు వంటివి చోరీ జరగడాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఒక ఎస్ఐకి నిత్యం పెట్రోలింగ్ బాధ్యతలు అప్పగించారు. కార్మిక నివాసాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సింగరేణికి సూచించారు. గస్తీకి సిబ్బందిని పెంచి ఎప్పటికప్పుడు కూడళ్లలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నా.. చోరీలు జరుగుతుండటంపై పోలీసు వర్గాలు సవాల్‌గా తీసుకుంటున్నారు.

ముంజల కోసం ఆగి మృత్యువాత



శారద(ఫైల్), తండ్రి వెంకటస్వామితో కార్తీక్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో తల్లీ కుమారుడు మృతి

రఘునాథపాలెం: తాటి ముంజలు కొనుగోలు చేసేందుకు ఆగగా.. కారు ఢీకొన్న ఘటనలో తల్లీ కుమారుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని బూడిదంపాడు సమీపంలో ఖమ్మం - ఇల్లెందు ప్రధాన రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో మహిళ భర్త కూడా తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కామేపల్లి మండలం జాస్తిపల్లికి చెందిన బత్తుల వెంకటస్వామి తన భార్య శారద (31), కుమారుడు కార్తీక్ (12)తో కలిసి ఖమ్మం శ్రీనివాసనగర్‌లో బంధువుల ఇంటికి వచ్చాడు. వారు ఉప్పలమ్మ దేవతను పెట్టుకోగా, ఆ వేడుక పూర్తయ్యాక ద్విచక్ర వాహనంపై సాయంత్రం తిరిగి బయలుదేరారు. బూడిదంపాడు సమీపంలోని పవర్ గ్రిడ్ వద్ద తాటి ముంజల కోసం రోడ్డుకు కుడివైపున ఆగారు. కొనుగోలు చేశాక ప్రయాణం ప్రారంభించే సమయంలో ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వేగంగా వెళ్తున్న కారు వీరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శారద, కార్తీక్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందగా, వెంకటస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడ ముంజలు విక్రయిస్తున్న వ్యక్తి కూడా గాయపడ్డాడు. వెంకటస్వామి ప్రస్తుతం ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వ్యవసాయంపై ఆధార పడి జీవిస్తున్న ఆయన ఖాళీ సమయంలో సుతారి పనులు కూడా చేస్తుంటాడు. బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నాడు. ఈ ఘటనపై సీఐ ఉస్మాన్‌షరీఫ్ కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య


సుమంత్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: పురుగులమందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన కమ్మచిచ్చు సుమంత్ (22) కొంతకాలంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 22న ఇంటికి వచ్చి, పురుగుల మందు సేవించాడు. కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

గుండాల: మండలంలోని కన్నాయిగూడెం సమీపంలోని గుడుంబా స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో సుమారు 1,200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామని సీఐ రవీందర్ తెలిపారు. గుండాలతండాకు చెందిన మోహన్, నర్సాపురతండాకు చెందిన భూక్యా రాజును అదుపులోకి తీసుకుని, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఆయన చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

భద్రాచలంఅర్బన్: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన అశోక్‌నగర్ కొత్తకాలనీలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. కార్పెంటర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న తుమ్మలపల్లి శ్రీను (33) ఇంట్లో ఉన్న కూలర్‌కు మరమ్మతులు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రికెట్ బాల్ తెచ్చిన గొడవ

ఎనిమిది మందిపై కేసు

పాల్వంచరూరల్: క్రికెట్ బాల్ తెచ్చిన తంటాతో ఇరువర్గాల వారు ఘర్షణ పడిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని ఇల్లెందులపాడుతండాలో శనివారం సాయంత్రం వాంకుడోతు పంతులు గడ్డి కోస్తున్నాడు. పక్కనే కొందరు క్రికెట్ ఆడుతున్నారు. ఈ క్రమంలో వారి బంతి వచ్చి గడ్డిలో పడింది. బంతిని తీసుకొచ్చేందుకు వచ్చిన విష్ణువర్ధన్, హర్షవర్ధన్‌తో పంతులు గొడవపడగా.. వారిద్దరు పంతులుపై దాడి చేశారు. ఆదివారం పంతులు ఫిర్యాదు మేరకు విష్ణువర్ధన్, రుషివర్ధన్, పూర్ణచందర్, యశ్వంత్‌పై కేసు నమోదు చేశారు. పంతులు తమ పిల్లలపై దాడి చేశాడని తల్లి దేవి ఫిర్యాదు మేరకు పంతులు, కృష్ణ, కొర్ర అరవింద్, భీమాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు

ములకలపల్లి: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (13) ఆదివారం బహిర్భూమి కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడ విచారించినా ఆచూకీ దొరక్కపోవడంతో బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బార్లు.. బార్లా


తెల్లవారుజామునే తెరిచిన ఖమ్మంలోని ఓ బార్


ఖమ్మంలోని బార్ పక్కన మద్యం సేవిస్తున్న మందుబాబులు

- నిబంధనలకు విరుద్ధంగా తెరిచి ఉంచుతున్న యాజమాన్యాలు
- తెల్లవార్లూ అమ్మకాల కొనసాగింపు
- అయినా పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

ఖమ్మంక్రైం: జిల్లాలోని ఖమ్మం నగరంతోపాటు, ఇతర పట్టణాల్లో ఉన్న బార్లు ఏటీఎం సెంటర్లుగా మారిపోయాయి. ఎనీ టైమ్ మందు అన్న తీరుగా తెల్లవార్లు మద్యం విక్రయిస్తున్నారు. జిల్లాలో 42 బార్‌లు ఉండగా అందులో జిల్లా కేంద్రంలోనే 35 కొనసాగుతున్నాయి. ఇందులో చాలాచోట్ల రాత్రింబవళ్లు మందు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఎక్సైజ్ నిబంధనలు తూచ్..

ఎక్సైజ్ శాఖ నిర్ణయించిన ప్రకారం బార్‌లు ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అమ్మకాలు కొనసాగించే వీలు ఉంది. అయి తే బార్ యజమానులు అసలు బార్లు మూయకుండానే డ్యూటీల వారీగా సిబ్బందిని నియమించుకొని 24 గంటల పాటు నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 12 గంటల తర్వాత ముందు షెట్టర్‌లు మూసివేసి వెనుక దారిగుండా బార్‌లో అమ్మకాలు కొనసాగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఖమ్మం నగరంలో..

నగరంలో ఒకటిరెండు బార్లు తప్ప అన్నింటిలో 24 గంటల పాటు మద్యాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం. కాల్వొడ్డులో రెండు దేవాలయాలకు సమీపంలో ఉండే బార్‌ను రెండు గంటల పాటే అతికష్టం మీద మూస్తున్నారని, తెల్లవారుజామున 4 గంటల నుంచే షెట్టర్‌ను ఒకవైపు తెరిచి విక్రయాలు జరుపుతున్నారని ఆలయాలకు వచ్చే భక్తులు చెబుతున్నారు. స్టేషన్‌రోడ్డులోని ఓ బార్‌లో ఏ సమయంలోనైనా మద్యం దొరుకుతుందని, మద్యం ప్రియుల మధ్య పలుమార్లు గొడవలు జరిగినా పోలీసులు వెళ్లి చెదరగొట్టిన ఘటనలున్నాయని తెలిసింది. నగరం నడిబొడ్డున, పాతబస్టాండ్, రూరల్ ప్రాంతాల్లో ఉన్నబార్లలో సైతం మద్యాన్ని యథేచ్ఛగా విక్రయిస్తున్నట్లు సమాచారం. వైన్స్‌లలో బార్ల స్థాయిలో పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసి మద్యాన్ని విక్రయిస్తున్నారని, దాబాల్లో మద్యం విక్రయిస్తున్నట్లు తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎక్సైజ్, పోలీస్ శాఖ పట్టించుకోవటం లేదని, అందుకే తాము కూడా మామూళ్లు ఇచ్చి విక్రయాలు కొనసాగిస్తున్నామని కొందరు బార్‌షాపుల యజమానులు చెబుతుండటం గమనార్హం.

మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ..

నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో, ముఖ్యంగా ఖమ్మం నగరంలో బార్లు నడుస్తున్నా ఎక్సైజ్ శాఖ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, నెలానెలా మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ వారే పట్టించుకోనప్పుడు తమకెందుకు రిస్క్ అని, తమకు రావాల్సిన మామూళ్లు ఇస్తే చాలని ఇతర అధికారులు చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు కొనసాగడం వల్ల రోడ్డుమీద వెళ్లే సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా బార్ల ముందు నుంచి వెళ్లడానికి భయపడుతున్నారు. తెల్లవారుజామున ఆలయాలకు వచ్చే మహిళలు బార్ల ముందు నుంచి వెళ్లేందుకు జంకుతున్నారు. వెంటనే ఎక్సైజ్ శాఖ స్పందించి నిబంధనలకు విరుద్ధంగా బార్లను నడుపుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

జిల్లాలో, ఖమ్మం నగరంలో ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా నడిపే బార్లపై చర్యలు తీసుకుంటాం. ఎక్సైజ్ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తాం. సమయానికి బార్లను మూయకుండా తెల్లవార్లు మద్యం నడిపితే ఆ బార్లను సీజ్ చేసే అవకాశం కూడా ఉంది.

–నాగేందర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఖమ్మం